తీరొక్క పూలపండుగ

- పాఠశాలల్లో ఘనంగా బతుకమ్మ సంబురాలు
- బతుకమ్మ పాటలతో ఆడిపాడిన విద్యార్థులు

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 12: మండల కేంద్రంలోని లిటిల్ బర్డ్స్ ఆల్ సెయింట్స్ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బతుకమ్మను తయారుచేసి ఆడిపాడారు. రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండుగను ప్రత్యేక పండుగగా చేపట్టడంతో గ్రామాల్లో మహిళలు బతుకమ్మను వారం రోజులపాటు బతుకమ్మ పండుగ నిర్వహిస్తూ చివరి రోజున గ్రామ సమీపంలోని చెరువులో నిమజ్జనం చేస్తారు. విద్యార్థులు కోలాటం ప్రదర్శనతో గ్రామ సమీపంలోని చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రఘుపతి రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్లలో బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

పెంట్లవెల్లి జెడ్పీహెచ్ఎస్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వీపనగండ్ల మండలంలో..

వీపనగండ్ల, అక్టోబర్12: దసర పండుగ సంబురాల్లో భాగంగా.. మండలంలోని ఆయా పాఠశాలలో బతుకమ్మ సంబురాలు గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని డాఫోడిల్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో వివిధ రకాల పూలతో అలంకరించిన బతుకమ్మలతో విద్యార్థులు ఆటపాటలతో ఆడిపాడారు. అనంతరం ఊరచెరువు వరకు ర్యాలీ నిర్వహించి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మి, కల్యాణి, రాజేశ్వరి, పార్వతి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

చిన్నంబావి మండలంలో..

చిన్నంబావి, అక్టోబర్ 12: మండలంలోని దగడపల్లి ప్రభుత్వ పాఠశాలలో బతుకమ్మ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా చిన్నారులు రంగు రంగుల దుస్తులు ధరించి తిరోక్క పూలతో గౌరమ్మ, బతుకమ్మను పేర్చి తెలంగాణ సంస్కృతిని చాటిచెబుతూ బొడ్డెమ్మ, బతుకమ్మ ఆటపాటలు పాడారు. బతుకమ్మ సంబురాల్లో చిన్నారులు చేసిన నృత్యాలు అంబరాన్నంటాయి. చిన్నారులు బతుకమ్మల చుట్టూ చేరి తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పేలా బతుకమ్మ ఆడారు. అదేవిధంగా దసరా పండుగను పురస్కరించుకొని నేటినుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

కోడేరు మండలంలో..

కోడేరు, అక్టోబర్ 12: మండలంలోని వివిధ గ్రామాల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో గురువారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పాఠశాలల్లో బతుకమ్మలను తయారు చేసి విద్యార్థులతో బతుకమ్మ ఆడించారు. అనంతరం బతుకమ్మను గ్రామ సమీపంలో కుంటలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు శ్రీలత, ఉపాధ్యాయులు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి మండలంలో..

పెంట్లవెల్లి, అక్టోబర్12: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో విద్యార్థులు గురువారం బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. తీరొక్క పూలతో బతుకమ్మను తయారు చేసి భక్తిశ్రద్ధలతో గౌరమ్మను పూజించి ఉత్సాహంగా ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు బతుకమ్మ ఆడారు. హెచ్ఎం బలరామకృష్ణారావు మాట్లాడుతూ.. సంప్రదాయాలను గౌరవిస్తూ.. వాటిని పాటించాల్సిన అవసరం ఎంతైన ఉందని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, అర్జున్‌గౌడ్, నర్సింహ, శ్రీనివాసులు, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

దగడపల్లిలో బతుకమ్మ నిర్వహిస్తున్న విద్యార్థులు

పెద్దకొత్తపల్లిలో బతుకమ్మలను నిమజ్జనానికి తరలిస్తున్న విద్యార్థులు

కోడేరు హరిజనవాడలో బతుకమ్మలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఎన్నికల పోలింగ్‌కేంద్రాల పరిశీలన

రేమద్దులలో గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

పాన్‌గల్, అక్టోబర్ 12: మండలకేంద్రంతోపాటు గోప్లాపూర్, రేమద్దుల గ్రామాల్లోని ఎన్నికల పోలింగ్ స్టేషన్లను గురువారం ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, ఎస్సై వేణు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం జరుతుందని, ఏదైనా సమస్య ఉంటే ఎన్నికల అధికారులు దృష్టికి తీసుకరావాలని కోరారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని కోరారు. ఈనెల చివరి వరకు అర్హులైన యువతీ, యువకులు ఓటరు నమోదు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమాలు పాటించాలి

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 12: మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఈ ఎన్నికల నియమాలను పాటించాలని తాసీల్దార్ యూసుఫ్‌అలీ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఏ రాజకీయ పార్టీ జెండాలు పోస్టర్లు లేకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వాట్సాప్ గ్రూపుల్లో ఇతర సోషల్‌మీడియాలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పోస్టులు పెడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో అనుమతులు లేకుండా డీజే సౌండ్లు, మైకులు ఏర్పాటు చేయరాదని తెలిపారు.

సోషల్ మీడియాను జాగ్రత్తగా వాడాలి

కోడేరు, అక్టోబర్ 12: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన సందర్భంగా సోషల్ మీడియాను జాగ్రత్తగా వాడాలని ఎస్సై శేఖర్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇతర సామాజిక మధ్యమాలలో మత విద్వేషాలు శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా పోస్టులు పెడితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పెరిగిన ఆధునిక టెక్నాలజీతో మాధ్యమాలపై నిఘా ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ సోషల్ మీడియాలో పెట్టే పోస్టుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

కోడేరు, అక్టోబర్ 12: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని తాసీల్దార్ సైదులు సూచించారు. రెవెన్యూ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంగించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఎన్నికల సమయంలో వాహనాల్లో మద్యం, డబ్బులను తరలిస్తే కేసులు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేస్తారన్నారు. వివిధ ప్రజాసంఘాలు ప్రజాప్రతినిధులు ఎవరైనా సభలు నిర్వహిస్తే తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. డబ్బును ఇతర ప్రాంతాలకు అత్యవసరంగా తీసుకెళ్తే వాటికి సంబంధించిన ఆధారాలు, బిల్లులు ఉంచుకోవాలన్నారు. పోలీసులు తనిఖీలు చేస్తున్నప్పుడు వాటిని తప్పనిసరిగా చూపించాలని కోరారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

పాన్‌గల్, అక్టోబర్12: ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై వేణు అన్నారు. గురువారం ఎస్సై విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోషల్ మీడియా, వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ గ్రూపులపై ఇతర వ్యక్తులు పార్టీలను రెచ్చగొట్టడం, కించపరిచడం, అవమానపరిచేవిధంగా పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. వాళ్లు చేసే చర్యలకు గ్రూప్ అడ్మిన్ బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై కొల్లాపూర్‌లో కాల్ సెంటర్ ఏర్పాటు

కొల్లాపూర్, అక్టోబర్ 12: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళిని ఉల్లంగిస్తే ఫిర్యాదు చేసేందుకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కాల్ సెంటర్‌ను గురువారం అధికారులు ప్రారంభించారు. కాల్ సెంటర్‌లోని 8522868332 నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని తాసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. కాల్‌సెంటర్ కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధికి వర్తిస్తుందని ఆయన చెప్పారు.

వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

కొల్లాపూర్, అక్టోబర్ 12: పట్టణంలోని ఏషియన్ డైమండ్ స్కూల్ ప్రిన్సిపాల్ కేథరిన్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు ఘనంగా బతుకమ్మ వేడుకలను జరుపుకొన్నారు. బతుకమ్మ సంబురాల సందర్భంగా పట్టణంలోని వృద్ధాశ్రమం వృద్ధులకు విద్యార్థులు సొంతఖర్చుతో వృద్ధులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోలాటం వీక్షిస్తున్న వృద్ధులు

సాగునీరు అందించాలి

పాన్‌గల్, అక్టోబర్12: ఎంజీకేఎల్ కాల్వ ద్వారా రైతులు సాగుచేసిన పంటపొలాలకు నీరందించాలని మండలంలోని కొత్తపేట రైతులు కోరారు. మండలకేంద్రంతోపాటు కొత్తపేట, మాందాపూర్, దవాజీపల్లి, అన్నారం, అన్నారం తండాలోని ఎంజీకేఎల్ఐ కాల్వ చివరి ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అధికారులు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

పాన్‌గల్, అక్టోబర్ 12: మండలంలోని శాగాపూర్‌కు చెందిన పుట్టపాగ కృష్ణయ్య(56) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి దశదినకర్మను పురస్కరించుకొని దళిత బహుజన సమైక్య సంఘం సభ్యులు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5,500 ఆర్థిక సాయం అందించారు.

పాఠశాలలుత నిఖీ

పాన్‌గల్, అక్టోబర్ 12: మండలంలోని మాందాపూర్, చింతకుంట ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను గురువారం మండల విద్యాధికారి లక్ష్మణ్‌నాయక్ సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరుశాతం, మధ్యాహ్నం భోజనం నాణ్యతను పరిశీలించారు . అనంతరం ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించాలని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పాటుపడాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

చింతకుంటలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో